RNI NO: TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

అనునిత్యం అక్షరసత్యం

సంపుటి: 03 సంచిక: 38 శుక్రవారం 25 ఏప్రిల్ 2025 ఎడిటర్: సీతార్ల సురేష్ పేజీలు: 8

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

## ఉగ్రదాడి ఘటనను భారత్ ఎన్నటికీ క్షమించదు



<u>ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదు దేశంపై జరిగిన దాడి</u>

<u>కలలో కూడా ఊహించని రీతిలో ప్రతి ఒక్కరినీ వేటాడి శిక్షిస్తాం</u>

<u>ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హెచ్చరిక</u>

**జనం వెలుగు, మధుబని:–** జమ్ము కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పెహల్‌గామ్‌లో ఉగ్రదాడి ఘటనను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. పెహల్‌గామ్‌లో ఉగ్రవాదులు నరమేధం సృష్టించి అమాయకుల ప్రాణాలు తీశారన్నారు. ఈ ఉగ్రదాడిని భారత్ ఎన్నటికీ క్షమించదన్నారు. బీహార్‌లోని మధుబనిలో జరిగిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ 'పెహల్‌గామ్‌లో ఉగ్రవాదులు నరమేధం సృష్టించారు. అమాయకుల ప్రాణాలు బలిగొన్నారు. ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదు. దేశంపై జరిగిన దాడి. ఈ దాడిని భారత్ ఎన్నటికీ క్షమించదు. ఉగ్రవాదులను వదిలిపెట్టేది లేదు. కలలో కూడా ఊహించని రీతిలో వారిని శిక్షిస్తాం. దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ వేటాడి శిక్షిస్తాం. ఉగ్రవాదాన్ని మట్టిలో కలిపే సమయం ఆసన్నమైంది. దేశ ప్రజలకు మాటిస్తున్నా ఈ దాడికి ప్రతీకారం తీర్చుకుంటాం. ఉగ్రనేతలను కూడా విడిచిపెట్టం. ప్రపంచం కూడా మా ప్రతీకారం ఎలా ఉంటుందో చూడబోతోంది' అంటూ ఉగ్రవాదులకు ప్రధాని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.

## ఆర్ట్స్ కాలేజీకు గుర్తింపు



**జనం వెలుగు, హైదరాబాద్, ఏప్రిల్ 24:–** ఉస్మానియా విశ్వవిద్యాలయంకు సంబంధించి విశిష్టమైన చిహ్నంగా నిలిచిన ఆర్ట్స్ కళాశాల భవనం మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. దేశంలోని అత్యంత ప్రసిద్ధమైన ట్రేడ్‌మార్క్ భవనాల జాబితాలో ఈ చారిత్రాత్మక నిర్మాణం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముంబైలోని తాజ్ హోటల్, స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనాల తర్వాత ఈ ఘనత సాధించిన మూడవ కట్టడంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల నిలవడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం. మేరకు ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాన్ని ఓయూ పూర్వ విద్యార్థి, ప్రముఖ ట్రేడ్‌మార్క్ న్యాయవాది సుభజిత్ సాహా ఓయూ వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమార్‌కి అందజేశారు. సుభజిత్ సాహా ఈ ప్రతిష్ఠాత్మక ట్రేడ్‌మార్క్ కోసం గత సంవత్సరం దరఖాస్తు చేశారు. ఈ ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ ద్వారా ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రత్యేక అనుమతి లేకుండా ఆర్ట్స్ కళాశాల భవనం యొక్క చిత్రాన్ని ఎలాంటి వాణిజ్య ప్రకటనలలో గానీ, ఇతర వ్యాపార అవసరాలలో గానీ ఉపయోగించడానికి వీలు లేదు. ఆర్ట్స్ కళాశాల భవనం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిందని వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమార్ అన్నారు. ఇప్పటికే ఎంతో గుర్తింపు, ప్రాధాన్యం కలిగిన ఈ భవనానికి ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ లభించడం మరింత గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఇది ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులందరికీ గర్వకారణమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ భవనం కేవలం ఒక నిర్మాణం కాదని, తరతరాల విద్యార్థుల జ్ఞాపకాలతో ముడిపడిన ఒక చారిత్రక సంపద అని ఆయన అభివర్ణించారు. భవిష్యత్తులో ఈ భవనం ప్రత్యేకతను కాపాడుకోవడానికి ఈ ట్రేడ్‌మార్క్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు తెలంగాణ స్టార్టప్ వ్యవస్థకు ఊతమిచ్చే టి–హబ్‌కు ప్రతిష్ఠాత్మకమైన 'బెస్ట్ కాన్సీవ్డ్ కోహోర్ట్ 2025' అవార్డు లభించింది. ఢిల్లీలో జరిగిన స్టార్టప్ మహాకుంభ్ 2025లో సెమీకండక్టర్ ప్రోగ్రామ్‌కు టి–హబ్ ఈ అవార్డును గెలుచుకుంది. ఈ అవార్డు టి–హబ్ విజన్, స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో దానికున్న నిబద్ధతకు నిదర్శనం.

## ప్రాణాలు తీస్తున్న కల్తీ కల్లు



**జనం వెలుగు, నిజామాబాద్, ఏప్రిల్ 24:–** తెలంగాణలో కల్తీ కల్లు ప్రవాహం విచ్చలవిడిగా సాగుతోంది. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నా కొన్ని ప్రాంతాల్లో అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తెలంగాణలో ప్రధానంగా మూడు రకాల కల్లు అందుబాటులో ఉంటుంది. తాటి, ఈత, ఖర్జూర చెట్ల నుంచి కల్లు తీస్తారు. చెట్ల నుంచి సహజంగా ఉత్పత్తయ్యే కల్లుతో సమస్య ఏం లేదు. కానీ కొందరు రసాయనాలు ఉపయోగించి కృత్రిమంగా కల్లు తయారు చేస్తున్నారు. ముఖ్యంగా పెద్దగా నగదు ఖర్చు పెట్టలేని పేదలే కల్లు తాగుతూ ఉంటారు. అలాంటివారు కల్తీ కల్లు తాగి చిత్రవిచిత్రమైన లక్షణాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో జోరుగా 'కల్తీ' కల్లు మాఫియా రెచ్చిపోతోంది. మోతాదుకు మించి రసాయనాలు కలిపి తయారు చేస్తున్న ఈ కల్లును తాగుతున్న అమాయక కూలీలు, పేదలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎప్పటికప్పుడు కల్లు అమ్మకాలపై తనిఖీలు నిర్వహించి పరీక్షలు నిర్వహించాల్సిన తెలంగాణ అబ్కారీ శాఖలో కొందరు అధికారులు వారిచ్చే ముడుపులు పుచ్చుకుని నోరు మెదపడం లేదనే ఆరోపణలున్నాయి.రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 30కి పైగా కల్లు దుకాణాలు నడుపుతున్నారు. కొంత మంది వ్యాపారులు రసాయనాలతో కల్లు తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ప్రాజోలమ్, వైట్ పేస్ట్ వంటి ప్రమాదకరమైన రసాయణాలను వినియోగించి కల్తీ కల్లును తయారు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఈ కల్తీ కల్లు తాగి శేరిలింగంపల్లి పరిధిలో వందల సంఖ్యలో అనారోగ్యానికి గురయ్యారు.ఇటీవల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కల్తీ కల్లు తాగి పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై మీడియాలో వరుస కథనాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా కల్తీకల్లు మూలాలపై యాక్షన్ మొదలు పెట్టింది అధికార యంత్రాంగం. అయితే రాష్ట్రమంతా కల్లు దుకాణాల్లో ఎక్సైజ్ అధికారులు శాంపిల్స్ సేకరించినా శేరిలింగంపల్లి ఎక్సైజ్ అధికారులు మాత్రం ఇంత పెద్ద అంశాన్ని లైట్‌గా తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్టేషన్ సీఐ సెలవులో ఉండటంతో ఎస్ఐలే బాసులుగా మారిపోయారు. తాము చెప్పిందే చట్టం అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఇంచార్జ్ సీఐను సైతం పక్కనబెట్టి వారే పెత్తనం సాగిస్తున్నారని ఎక్సైజ్ శాఖలోనే చర్చ జరుగుతుంది.ఇంతమంది ప్రాణాలు ప్రమాదంలో ఉన్నా శేరిలింగంపల్లి ఎక్సైజ్ అధికారులు కల్తీ కల్లును ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదు.? తరచుగా తాము శాంపిళ్లు సేకరిస్తామని చెబుతున్న అధికారులు ఎన్ని షాపులపై కేసులు పెట్టారో తెలుపమంటే మాత్రం తప్పించుకుంటున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఈ అంశంపై కలగజేసుకుని క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకుని ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఒక్క మార్కుతో లక్షా 85 వేల మంది ఫెయిల్

**జనం వెలుగు, హైదరాబాద్, ఏప్రిల్ 24బీ–** తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఒక్క మార్కు తేడా అనేకమంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపింది. బోర్డు వర్గాల ప్రకారం, దాదాపు 1.85 లక్షల మంది విద్యార్థులు ఒక్క మార్కు తేడాతో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఇది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆవేదనను కలిగించింది. ఈ ఏడాది మొత్తం ఉత్తీర్ణత శాతం 71.37గా నమోదైంది. ఇందులో బలమైన ప్రదర్శన కనబర్చిన గురుకుల విద్యా సంస్థలు 83.17 శాతం ఉత్తీర్ణతతో ముందున్నాయి. అంతేకాకుండా, కొన్ని కళాశాలల్లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులు మెరిశారు. బైపీసీ స్ట్రీమ్‌లో ఓ విద్యార్థిని 997 మార్కులతో టాప్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఎంపీసీలో నలుగురు విద్యార్థులు 996 మార్కులు సాధించారు. దేవరకొండ గిరిజన సంక్షేమ పాఠశాలలో చదివిన విద్యార్థిని కూడా బైపీసీలో 996 మార్కులు సాధించడం విశేషం. ఇదిలా ఉంటే 1.85 లక్షల మంది ఫెయిల్ కావడంపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారు చెప్పినట్లు, గ్రేస్ మార్కులు, రీ–వెల్యుయేషన్ విధానాలపై స్పష్టత అవసరం. అలాగే, విద్యార్థుల మెరుగైన మానసిక స్థితిని పరిగణలోకి తీసుకుని, మరింత హృదయపూర్వక పరీక్షా విధానం అవసరమని సూచిస్తున్నారు. రీవాల్యువేషన్, రీకౌంటింగ్‌లో ఇందులో చాలా మంది పాస్ అయ్యే అవకాశం ఉంది. ఇక మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ మే మొదటి వారంలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇందులో ఫెయిల్ అయిన విద్యార్థులు పాస్ అయ్యే అవకాశం ఉంది.

## భారత్‌లో పాకిస్థాన్ 'ఎక్స్' ఖాతాను నిలిపివేస్తూ కేంద్రం నిర్ణయం

**జనం వెలుగు, న్యూ ఢిల్లీ ఏప్రిల్ 24:–** మంగళవారం మధ్యాహ్నం ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పెహల్‌గామ్ లో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నరమేధంలో 28 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని కేంద్రం తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలో దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై చర్యలకు దిగింది. సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, పాకిస్థానీ జాతీయులకు భారత్‌లో ప్రవేశంపై నిషేధం విధించడం వంటి ఐదు అంశాలతో కూడిన చర్యలను భారత్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా భారత్‌లో పాకిస్థాన్ 'ఎక్స్' ఖాతాను నిలిపివేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. పెహల్‌గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వ అధికారిక ఎక్స్ అకౌంట్‌ను యాక్సెస్ చేయకుండా నిలిపివేసింది.

**పాకిస్థాన్‌పై భారత్ చర్యలు**

1960లో పాక్‌తో కుదుర్చుకున్న సింధూ నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలుపుదల చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. సీమాంతర ఉగ్రవాదానికి అందచేస్తున్న మద్దతును నిలిపివేస్తున్నట్లు పాక్ నుంచి స్పష్టమైన, విశ్వసనీయమైన ప్రకటన వెలువడే వరకు నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అటారీ–వాఘా సరిహద్దు చెక్‌పోస్టును వెంటనే మూసివేస్తున్నట్లు తెలిపింది. చట్టబద్ధమైన పత్రాలతో భారత్‌లోకి ప్రవేశించిన పాకిస్థానీ పౌరులు మే 1వ తేదీలోగా ఈ మార్గంలో తిరిగి వెళ్లిపోవచ్చని భారత్ ప్రకటించింది. సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాకిస్థానీ జాతీయులు భారత్‌లో ప్రయాణించడానికి అనుమతించబోమని ప్రభుత్వం ప్రకటించింది.

TELTEL/2023/87917
జనంవెలుగు
www.janamvelugu.com, janamvelugu2023@gmail.com
అనునిత్యం అక్షరసత్యం



# వీడీసీల పేరుతో అగ్రవర్ణాల దాడులు

## బాధితుల విజ్ఞప్తిపై బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కమిషన్లకు ఫిర్యాదు బివిఎం రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ బట్టు

**జనం వెలుగు, నిజామాబాద్, ఏప్రిల్ 24:–** గ్రామ అభివృద్ధి కమిటీల విడిసి పేరుతో జరుగుతున్న కుల వివక్ష, దాడులపై బీవీఎమ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ బట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన హుటాహుటిన బీసీ కమిషన్ చైర్మన్ డా. నిరంజన్, మైనారిటీ కమిషన్ చైర్మన్ తహరీక్ అన్సారీ, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్‌ను కలసి విపరీతమైన కులదౌర్జన్యాల వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలలో విడిసిల పేరుతో గౌడ, గంగపుత్ర, రజక, నాయి బ్రహ్మణ, యాదవ, ముదిరాజ్, మాదిగ తదితర బలహీనవర్గాలపై భౌతికంగా దాడులు చేయడం, వృత్తులకు వ్యతిరేకంగా పన్నులు వేయడం, ఆర్థిక దోపిడీలు కొనసాగుతున్నట్లు ఫిర్యాదు చేశారు. తాళ్ళారాంపూర్ గ్రామంలో గౌడ మరియు మాల కులస్తులపై 'అర్థాల్' పేరుతో లక్షల రూపాయల డిమాండ్ చేయడంతో పాటు, గీతవనాల్లో నీరు తాగకుండా నిషేధం విధించడం, వారి ఆడబిడ్డలను గుడిలో ప్రవేశించకుండా తిప్పికొట్టడం, చివరికి తాటి వనాలను కాల్చివేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయని వివరించారు. ఈ దాడుల నేపథ్యంలో 53 మంది గౌడ, 7 మంది ఎస్సీ కుటుంబాలను



సాంఘిక బహిష్కరణ చేయగా, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినా అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. గౌడ వృత్తిదారులకు ఉన్న లైసెన్సు హక్కులను లెక్కచేయకుండా ఇతర గ్రామస్తులతో తాటి వనాన్ని కబ్జా చేయాలన్న నిర్ణయాన్ని గ్రామ అభివృద్ధి కమిటీ తీసుకోవడం దారుణమని, ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. "వీడీసీలను వెంటనే రద్దు చేయాలి. చట్టపరంగా అనుమతులు లేని ఈ కమిటీలను తక్షణమే నిలిపివేసి బాధితులకు న్యాయం చేయాలి," అని డిమాండ్ చేశారు.

# మోడీ ఇంటర్నల్ టెర్రరిస్ట్



**జనం వెలుగు, విజయవాడ, ఏప్రిల్ 24:–** ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రధాని మోదీపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఈ దేశ ఇంటర్నల్ టెర్రరిస్ట్ ప్రధాని నరేంద్ర మోడీ అని మండిపడ్డారు. ఇండియా నిఘా వ్యవస్థలను మోడీ వ్యవస్థలుగా మార్చారని ఆరోపించారు. విశాఖలో మీడియాతో మాట్లాడిన ఆమె ఇండియా ఇంటలిజెన్స్ అంతా మోడీ కోసం పని చేస్తోందని మోడీ కి వ్యతిరేకంగా మాట్లాడే వాళ్ళ గొంతు నొక్కేందుకు నిఘా వ్యవస్థ పని చేస్తోందని ఆరోపించారు. పహెల్గాం ఘటన కు బాధ్యులు మోడీ, అమిత్ షానే అని విమర్శించారు. మోడీ, అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలన్నారు. పాలన చేసే హక్కు లేదు చౌకిదార్ మోడీ దేశానికి కాదు. కేవలం బీజేపీకి మాత్రమేనని ఘాటు విమర్శలు చేశారు. జమ్మూ కశ్మీర్ లోని పెహల్గాంలో టూరిస్టులపై జరిగిన దాడిని దేశం మీద జరిగిన దాడిగా షర్మిల అభివర్ణించారు. దేశంలో శాంతి భద్రతలు గొప్పగా ఉన్నాయని మోడీ ఒక క్యాంపెయిన్ నడిపారని పెద్ద పెద్ద బోర్డులు పెట్టారన్నారు. ఇది చూసి ఏటా 2 కోట్ల మంది కాశ్మీర్ కి వెళ్తుంటారని ఇలాంటి ప్రాంతంలో సెక్యూరిటీ లోపం ఎందుకు అని షర్మిల ప్రశ్నించారు. ఇది ముమ్మాటికి భద్రత లోపమేనన్నారు. టూరిస్టులపై కాల్పులు జరుపుతుంటే ఆర్మీ వాళ్ళు లేనే లేరని ఒక కన్ను వేసి ఉంటే వాళ్ళు వచ్చే వాళ్ళు కాదన్నారు. ప్రొటెక్షన్ కోసం ఉండే సెక్యూరిటీ కూడా లేదన్నారు. ఇంతమంది చనిపోయారు అంటే ప్రభుత్వ లోపమేనని విమర్శించారు. ఉగ్రవాదం కంట్రోల్ చేయాల్సిన బాధ్యత బీజేపీ పై ఉందని షర్మిల అన్నారు. మోడీ చౌకిదార్ అని చెప్పుకుంటున్నారు. ఇదేనా చౌకిదార్ తనం అని ప్రశ్నించారు. ఈ ఘటనకు అమిత్ షా, మోడీ బాధ్యత వహించి రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఇంటలిజెన్స్ ఫెయిల్యూర్ ఇవ్వాళ దేశ నిఘా వ్యవస్థ దేశం కోసం పని చేయడం లేదు. ఇండియా ఇంటలిజెన్స్ అంతా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నా వల్ల మీద వాడుతున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ మీద వ్యతిరేకంగా మాట్లాడే వాళ్ళ మీద వాడుతున్నారు. ఇంత ఘోరంగా సెక్యూరిటీ విఫలం కావడం దారుణమన్నరు. వీళ్లకు అధికారంలో ఉండే హక్కు లేదు. వీళ్ళు దేశానికి చౌకిదార్ కాదు. బీజేపీకి చౌకి దార్లు అని మండిపడ్డారు. ఈ దేశ దర్యాప్తు వ్యవస్థలను సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని నిఘా వ్యవస్థ బలం అంతా మోడీ కోసం పని చేస్తుందన్నారు. ఇది ముమ్మాటికి కేంద్రం తప్పిదమేనన్నారు. ఈ ఘటనలో ఒక ముస్లిం కూడా చనిపోయారు. దేశంలో ఉన్న ముస్లింలను చెడ్డవాళ్ళు అని చూపించే ప్రయత్నం చేస్తున్నారు. మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని షర్మిల ఆరోపించారు. ఈ దేశంలో మతం పేరుతో యుద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ఈ దేశంలోనే ఇంటర్నల్ గా భద్రత లేదు. అన్ని మతాలు సమానం అనే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తీవ్రవాదులకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఇంటర్నల్ టెర్రరిస్ట్ మోడీ మోడీ శ్రమ దేశ భద్రత కోసం పెట్టి ఉంటే బయట వాళ్ళు చొరబడే పరిస్థితి లేదని విమర్శించారు.

## పర్యావరణంపై ఆ కుటుంబానికి ప్రత్యేక శ్రద్ధ

### తాత అడుగుజాడల్లో మనవరాలు

**జనం వెలుగు, ఖమ్మం:–** పద్మశ్రీ వనజీవి రామయ్య దశదినకర్మ సందర్భంగా మూడువేల మొక్కలు, జ్యూట్ బ్యాగులు బొడ్డుపల్లి రమేష్ గౌతమి దంపతులు అందించారు. మూడువేల పండ్ల మొక్కలతోపాటు జూట్ బ్యాగులను పద్మశ్రీ మన జీవి రామయ్య మనవరాలు బొడ్డుపల్లి గౌతమి రమేష్ అందించారు. ఇటీవల పద్మశ్రీ వనజీవి రామయ్య గుండెపోటుతో మృతి చెందగా ఆయన దశాదినకర్మను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మనవరాలు బొడ్డుపల్లి గౌతమి రమేష్ తాత



పర్యావరణహితంపై చూపిన శ్రద్ధను కొనసాగింపుగా మూడువేల జ్యూట్ బ్యాగులను, పండ్ల పూల మొక్కలను అక్కడికి వచ్చిన వారికి అందించారు. దశాదినకర్మకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ మొక్కలను తీసుకొని సంతోషం వ్యక్తం చేశారు. పర్యావరణంపై ఆ కుటుంబానికి ఉన్న శ్రద్ధను కొనియాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రాజకీయ ప్రముఖులు అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

## భూభారతి చట్టంపై అవగాహన సదస్సు: రైతులకు సమాచారం అందజేసిన కలెక్టర్



**భీంగల్:–** భీంగల్ పట్టణంలోని మెరీడియన్ ఫంక్షన్ హాల్ లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భూములపై రైతులకు ఎదురవుతున్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి చట్టం లక్ష్యం భూముల నమోదు మరియు పరిరక్షణను మరింత సులభతరం చేయడమేనని పేర్కొన్నారు. రైతులు తమ భూముల వివరాలను సరిగ్గా నమోదు చేయించుకోవాలని, సమస్యలు ఉంటే తగిన ఆధారాలతో అధికారులు ఎదుట వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీంగల్ మండల తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు హాజరై చట్టంపై తమ సందేహాలను వ్యక్తపరచి సమాధానాలు పొందారు.

## తెలంగాణ ఉద్యమ కళాకారుల వివరాలు సేకరణ కార్యక్రమం

**జనం వెలుగు:–** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో తొలి మలిదశల తెలంగాణ ఉద్యమ కారుల వివరాల కోసం 2025.... 25 ఏప్రిల్ నుండి మే 18 వరకు 33 జిల్లాల 6504 మండలాల తెలంగాణ ఉద్యమ కారుల వివరాలు సేకరణ కార్యక్రమమునిర్వహించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు అన్నారు. వారి ఆదేశం మేరకు ఇట్టి కార్యక్రమమును 33 జిల్లాల అధ్యక్షులు కన్వీనర్లు జిల్లా కోఆర్డినేటర్లు 654 మండలాల అధ్యక్షులు కన్వీనర్లు కోఆర్డినేటర్లు అందరూ కలిసి ఇట్టి వివరాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.జిల్లా అధ్యక్షులు మండలాల అధ్యక్షులు పూర్తి బాధ్యతలు తీసుకొని వివరాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించవలసిందిగా తెలియజేశారు. జిల్లాల మండలాల ఉద్యమకారులు సభ్యత్వం కాని వారు సభ్యత్వం తీసుకొని పూర్తి వివరాలను జిల్లాల అధ్యక్షులకు మండలాల అధ్యక్షులకు అందజేయగలరని కోరారు.

## వరంగల్ జిల్లాలో 14 మంది మావోయిస్టులు లొంగుబాటు

**జనం వెలుగు, వరంగల్:–** వరంగల్ జిల్లా కేంద్రంలో 14 మంది మావోయిస్టులు గురువారం లొంగిపో యారు. పోలీసులు ఎదుట లొంగిపోయిన వారిని ఐజి చంద్రశేఖర్ రెడ్డి, మీడియా ముందుకు తీసుకువచ్చారు. ఒక్కొక్క మావోయిస్టు కు రూపాయలు 25 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ నక్సలిజం మార్గాన్ని వదిలిపెట్టి కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని ఆయన సూచిం చారు. మావోయిస్టులు హింసాయుత విధానాలు వదిలి వేసేలా చేయడమే మా ఉద్దేశం ఏ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు వచ్చి లొంగిపోయిన సహకారం అందిస్తాం జనజీవన స్రవంతిలో కలిస్తే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఐజి చంద్రశేఖర్ రెడ్డి, తెలిపారు.

**లొంగిపోయిన వారి పేర్లు:**

ఏవో బిఎస్ జెడ్ సి, డివిజన్ గాలికొండ ఏరియా కమిటీ సభ్యుడు మడవి అంద రాజేష్, మరియు కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి, ఉదయ్ కి చెందిన ప్రొటెక్షన్ టీం ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి, డివిజన్ కమిటీ సభ్యులు మరకం హిడుమే, మడకం జోగి, కోవాసి జోగి, పోడియం భూమిక, సోడి కోసి వెన్నెల, సోడి బుద్రి బ్రిద్రి, మడవి పూజే, హేమ్లా సోను, సోడి రమేష్ భీమా మిలిషియా సభ్యులు అట్టం బుద్ర, కోవాసి ఇడుమ, కోర్సా లాలు, హేమ్లా సుక్కు అర్జున్, కోర్సా సుక్కు లొంగిపోయినవారు. ఛత్తీసగఢ్, ఒరిస్సా రాష్ట్రల లో పలు విధ్వంసకర సంఘటనలలో, పోలీసు లపై దాడి చేసిన ఘటనల లో, ఇన్ఫార్మర్ల నెపంతో హత్య చేసిన సంఘట నలలో పాల్గొన్నారు.

Edited, Printed, Owned and Published by SITHARLA SURESH at H.No. 1-42/8, Talveda, Nandipet (M), NIZAMABAD - 503 212 Telangana State and Printed at Kranthi Printing Press, 42/603/1/1-A, MJ Colony, Sreet No. 5, MJ"Colony, Moulaali, Secunderabad, Telangana-500 040, RNI:TELTEL/2023/87917, Editor : SITHARLA SURESH E-mail : janamvelugu2023@gmail.com Ph : 9603322119.